క్లుప్తంగా

చీరల పంపిణీ



భక్తులకు చీరలు పంపిణీ చేస్తున్న పెద్దలు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల వాసులు ఇలవేల్పుగా కొలుస్తున్న ఇందిరానగర్ మోదకొండమ్మకు భక్తులు సమర్పించిన చీరలను ఆదివారం పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెతకంశెట్టి మౌర్య, ఆలయ కమిటీ చైర్మన్ కేవీ బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు నానేపల్లి జయశంకర్, కార్యదర్శి గందేపల్లి కనకకుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటరమేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో సామాజిక భవనం నిర్మాణానికి ఆదివారం కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడి కమ్యూనిటీ హాల్ శిథిలమైందని, దాని స్థానంలో రూ.49 లక్షలతో నూతన భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ వెంకటలక్ష్మి, బొడ్డేటి విజయ్‌కుమార్, స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

స్టేట్ బాక్సింగ్ అసోసియేషన్ కోశాధికారిగా శ్రీనివాసరావు



ఉక్కునగరం: రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కోశాధికారిగా ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారుడు, స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం మాజీ అధికారి కడియాల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఐ.వి. రావు, కార్యదర్శి పి. మధుసూదనరావు తదితర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్రాంత న్యాయమూర్తి గెడ్డన్న సమక్షంలో జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికలకు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఆర్. గోపు, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి కె. సూర్యనారాయణ, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి రమణ పరిశీలకులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

'విశాఖ నాకు ఎంతో ఇచ్చింది'



సినీ నటుడు సత్యసాయి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

మహారాణిపేట: విశాఖ నగరం, ఇక్కడి ప్రజలు తనను ఎంతగానో ఆదరించి అక్కున చేర్చుకున్నారని, వారి అభిమానంతోనే ఇప్పటి వరకు 130 సినిమాలకు పైగా నటించే అదృష్టం తనకి దక్కిందని వర్ధమాన సినీ నటుడు వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ అన్నారు. మిషన్ కర్షక దేవోభవ జాతీయ అధ్యక్షుడు ఆడారి కిషోర్ కుమార్ అధ్యక్షతన నగరంలోని ఒక హోటల్లో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు విషయాలు తెలిపారు. సభాధ్యక్షుడు డాక్టర్ ఆడారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ సత్య సాయి శ్రీనివాస్ అనతి కాలంలోనే విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ముఖ్య అతిథి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి, ప్రొఫెసర్ డి. సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ సత్యసాయి శ్రీనివాస్ సినీ రంగంలో స్థిరపడడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సినీ నిర్మాత పి. నీల తిలక్, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రెసిడెంట్ నరవ ప్రకాశరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రచయిత శంకర్ నీలు భాగవతుల తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెదగంట్యాడ: భగవాన్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో సేవలు చేయడం అభినందనీయమని పలువురు అన్నారు. పిరమిడ్ స్పిర్చువల్ ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో శాకాహారం విశిష్టతపై ఆదివారం అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు.

మద్యంపై పోరుబాట

- 56వ వార్డులో నిబంధనలు మీరి మద్యం దుకాణం ఏర్పాటు
- తమ ప్రాంతంలో వైన్ షాప్ వద్దంటూ స్థానికుల నిరసనలు
- స్పందించని ఎమ్మెల్యే గణబాబు, అధికారులు



ఎఫ్‌సీఐ గిడ్డంగి రహదారిలో నిరసన తెలుపుతున్న 56వ వార్డు కాలనీల ప్రజలు



ఆర్పీ పేట పైడిమాంబ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ముందు స్థానికుల నిరసన

కంచరపాలెం: కూటమి ప్రభుత్వంలో ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎడాపెడా అనుమతులిచ్చేశారు. దీంతో స్థానిక మహిళలు రోడ్డెక్కి నిరసనలు చేపడుతున్నారు. మద్యం వల్ల కుటుంబాలు చిన్నాభిన్న మవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాబు ష్యూరిటీ.. ప్రజలకు మత్తు గ్యారెంటీ అంటూ ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 56వ వార్డు కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట రైల్వే గేటు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో స్థానిక మహిళలు పోరుబాట పట్టారు. మోనార్క్ వైన్స్ పేరిట షాపు ఏర్పాటు చేస్తుంటే స్థానిక కూటమి శ్రేణులు తమకు సంబంధం లేదన్నట్లు నిర్లక్ష్యంగా ఉన్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

గుడి, బడి మధ్యలో మద్యం దుకాణం

ఆర్పీ పేట రైల్వే గేటు దరి పైడిమాంబ ఆలయం వద్ద 15 రోజుల కిందట అర్ధరాత్రి హడావిడిగా మోనార్క్ వైన్స్ పేరిట షాప్ ఏర్పాటు చేశారు. ముహూర్తం చూసుకుని ప్రారంభించి.. ఉదయాన్నే మూసేశారు. సాయంత్రం చీకటి పడ్డాక దుకాణం తెరవడంతో ఆయా కాలనీల పెద్దలు, నివాసుల నేతృత్వంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మద్యం దుకాణానికి 100 మీటర్ల దూరంలో పైడిమాంబ అమ్మవారి దేవాలయం, 400 మీటర్ల దూరంలో బడి ఉండటంతో వైన్ షాప్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. అటు గవర కంచరపాలెం, దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యమాంబ కాలనీ, ఆర్పీ పేట, గొల్ల కంచరపాలెం.. ఇటు జ్ఞానాపురానికి వెళ్లే మార్గంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, గెడ్డ వీధి, సెబాస్టియన్ కాలనీ, బాబు కాలనీల ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు భారీగా చేరి ధర్నా చేపడుతున్నప్పటికీ.. పోలీసుల పర్యవేక్షణలో వైన్ షాప్ యాజమానులు మద్యాన్ని విక్రయిస్తున్నారు.



వైన్ షాప్ వద్దంటూ నిరసన చేపట్టిన ప్రజలతో పోలీసుల వాగ్వాదం (ఫైల్)

తరలించకుంటే ముట్టడిస్తాం..

తమ వార్డు నుంచి మద్యం దుకాణాన్ని తరలించాలని నిరసనలు, ధర్నాలు చేస్తుంటే.. స్థానిక ఎమ్మెల్యే గణబాబు, ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించడం లేదని గ్రామాల పెద్దలు, మహిళలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించాలని, లేనిపక్షంలో వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే ఏర్పాటు

2014 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం తరువాత 2016లో ఇటు 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట, గవరకంచరపాలెం.. అటు జ్ఞానాపురం పరిసర ప్రాంతాల్లో చంద్రబాబు ప్రభుత్వం మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేసింది. ఆయా గ్రామాల ప్రజల పోరాటంతో నేటి వరకు ఇక్కడ మద్యం దుకాణాల జాడ కనిపించ లేదు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్పీ పేట ఎఫ్‌సీఐ గిడ్డంగి రహదారిలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆక్రమిత దుకాణానికి అనుమతి ఎలా..?

ఆర్పీ పేట ప్రధాన గేటు, ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ కార్యాలయం, పైడిమాంబ కాలనీల నుంచి భారత ఆహార గిడ్డంగి రహదారికి ఆనుకుని ఉన్న జీవీఎంసీ స్థలంలో సుమారు 35 ఏళ్ల నాటి నుంచి రేకులు షెడ్ దుకాణాలు నిర్మించి జీవీఎంసీ ట్యాక్స్‌లు, ట్రేడ్ లైసెన్స్, విద్యుత్ శాఖకు కరెంట్ బిల్లు చెల్లించి వ్యాపారాలు చేస్తున్నారు. అలాంటి ఆక్రమిత రేకుల షెడ్‌లో మద్యం దుకాణానికి రెంటల్ అగ్రిమెంట్ లేకుండా ఎక్సైజ్ శాఖాధికారులు ఎలా అనుమతులు మంజూరు చేసారో చెప్పాలని పలువురు స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మద్యం దుకాణంతో ఇబ్బందులు



మా వార్డులో బడి-గుడి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం చాలా బాధాకరం. కుటుంబాలతో కలిసి ఇక్కడ జీవిస్తున్నాం. మద్యం దుకాణం వద్ద మందు బాబుల హడావుడి ఎక్కువగా ఉంది. రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా మారింది. ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

– పెంటకోట దేవకి, కంచరపాలెం

ప్రజాప్రతినిధుల జాడే లేదు



ప్రశాంతంగా ఉన్న మా ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనం. 15 రోజులుగా నిరసనలు, ధర్నాలు చేపడుతున్నాం. కూటమి నాయకులు, కార్యకర్తల ఓదార్పు, హాస్యాస్పదంగా ఉంది. ప్రజాప్రతినిధులు జాడ లేదు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం మా వార్డులో సోమవారం జరగనుంది. ఈ సమస్యను పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ దృష్టికి తీసుకెళ్తాం.

–బొడ్డేటి చిన్నా, గ్రామ ప్రధాన కార్యదర్శి, ఆర్పీ పేట

వినాయక ఆలయం వద్ద పోలీసుల పహారా

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలే అవుట్‌లోని వినాయకుడి గుడి వద్ద ఆదివారం పోలీసులు పహారా కాయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం ఆలయ కమిటీ పెద్దలతో పాటు కాలనీ అసోసియేషన్ బాధ్యులు అంతా సమావేశమయ్యారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశానికి కాపలాగా పోలీసులు రావడంపై కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమవుతుందనే సమాచారం ఉంటేనే పోలీసుల బందోబస్తు ఉంటుంది. ఉత్సవాల నిర్వహణ కోసం ఆలయ పెద్దలు,కాలనీ అసోసియేషన్ పెద్దలు ఏర్పాటు చేసుకున్న సమన్వయ సమావేశం జరుగుతున్న సమయంలో పోలీసులు ఎందుకొచ్చినట్లని అంతా ముక్కున వేలేసుకున్నారు. అసలు పోలీసులను ఎవరు పిలిపించారు..? వారెందుకు వచ్చారు..? అనే చర్చసాగింది. ఆలయంలో జరిగే సమావేశంలో గొడవలు జరిగే అవకాశం ఉందని సమాచారం ఇవ్వడంతోనే తాము ఇక్కడికి వచ్చామని పోలీసులు తెలపగా.. ఇలా అయితే కాలనీ వాసులను అవమానించినట్లేనని కొంతమంది వ్యతిరేకించారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఆలయాభివృద్ధి, నవరాత్రి ఉత్సవాల్లో చేయాల్సిన కార్యక్రమాల గురించి ఆలయ కమిటీ పెద్దలు చర్చించారు.

విద్యతోనే ఉన్నత గౌరవం



విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందిస్తున్న అతిథులు, సంఘ సభ్యులు

కంచరపాలెం: విద్యతోనే ఉన్నత స్థాయి గౌరవం లభిస్తుందని జార్ఖండ్ వీసీ ఆచార్య సూరిశెట్టి జవహర్, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీ ఆధ్వర్యంలో ఆదివారం కంచరపాలెం ఆశీర్వాద కల్యాణ మండపంలో ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాల సత్కార వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులతోపాటు గురువులకు గౌరవమివ్వాలన్నారు. గౌరీ సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ముందుగా గౌరీమాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 500 మంది ఉత్తమ విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మళ్ల భాస్కరరావు, పీలా సుజాత, మళ్ల సురేంద్ర, బుద్ధ రమేష్, రాజబాబు, దివాకర్, వెంకటరావు, బి.వి.లక్ష్మి, రాజశేఖర్, రమేష్, లచ్చ అప్పారావు, శ్రీనివాసరావు, బి.అప్పారావు, ఎస్.లక్ష్మి, బొడ్డేటి జగ్గయ్యమ్మ, సంఘ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టంలో అర్చకులు



గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడ సేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవను జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అండర్‌-16 క్రికెట్ పోటీల్లో విశాఖ విజయం



విశాఖ స్పోర్ట్స్ : స్టీల్‌ప్లాంట్‌లోని కోల్ సీకే నాయుడు ఉక్కునగరం స్టేడియంలో ఈనెల 23 నుంచి 26 వరకు జరిగిన ఏసీఏ పురుషుల -16 క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో శ్రీకాకుళంపై విశాఖపట్నం జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌లో కె.భాను శ్రీహర్ష 146 బంతులు ఎదుర్కొని 140 పరుగులు చేశాడు. నందసిమ్మ వివేక్ 190 బంతుల్లో 66 పరుగులు, పల్లిక్ రుతిక్ సాగర్ 58 బంతులు ఎదుర్కొని 38 పరుగులు సాధించారు. బౌలింగ్‌లో శ్రీకాకుళం జట్టు కెప్టెన్ వీఎస్‌వీ ప్రణీత్ 16 ఓవర్ల (3 మేడిన్)లో 36 పరుగులిచ్చి 6 వికెట్లు తీశాడు. దన్నిన భాను స్వరూప్ 12.2 ఓవర్ల (1 మేడిన్)లో 28 పరుగులిచ్చి నాలుగు వికెట్లు, కె.గౌతమ్ ఆర్య 11 ఓవర్ల (2 మేడిన్)లో 28 పరుగులిచ్చి మూడు వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్‌కు అంజిరెడ్డి, గుర్రం తిరుమలరావు అంపైర్లుగా కోశన శివ స్కోరర్‌గా వ్యవహరించారు.

వ్యాపారులు వచ్చేనా!

- తోపుడుబళ్ల వ్యాపారులను హాకర్స్‌జోన్‌కు తరలించేందుకు యత్నం
- రూ.14 లక్షలతో మరమ్మతులు
- అక్కడ వ్యాపారాలు సాగవంటున్న వ్యాపారులు
- ఎలాగైనా తరలించాలని అధికారుల నిర్ణయం



గుల్లలపాలెం వద్ద హాకర్స్ జోన్



హాకర్స్ జోన్‌లో గ్రిల్స్ ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

మల్కాపురం: తోపుడుబళ్ల వ్యాపారుల కోసం గుల్లలపాలెం వద్ద ఏర్పాటు చేసిన హాకర్స్ జోన్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. ఈసారి ఎలా అయినా తోపుడుబళ్ల వ్యాపారులను ఇక్కడికి తీసుకురావాలని అధికారులు ప్రయత్నిస్తుండగా .. వ్యాపారాలు సాగని చోట మేం వచ్చి ఏం చేయాలంటూ తోపుడుబళ్ల వ్యాపారులు పట్టు బిగిస్తున్నారు. ఈసారి మరి ఎవరి మాట నెగ్గుతుందో వేచి చూడాలి.

ఏళ్ల తరబడి ఇదే సమస్య

పారిశ్రామిక ప్రాంత ప్రధాన కూడళ్లలో తోపుడుబళ్ల వ్యాపారులు సర్వీస్‌రోడ్డుకు అడ్డంగా వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యగా మారింది. దీనిపై ట్రాఫిక్ పోలీసులు పాలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పాలకులు 2014లో సుమారు 30 షాపులతో కూడిన హాకర్స్ జోన్‌ను సుమారు రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించారు. ఉచితంగా షాపులు ఇస్తామని, అక్కడ వ్యాపారాలు చేసుకోవాలని జీవీఎంసీ అధికారులు శ్రీహరిపురం, కోరమాండల్ వద్ద గల తోపుడుబళ్ల వ్యాపారులకు సూచించారు. అక్కడ తమకు వ్యాపారాలు సాగవని, తాము అక్కడికి వచ్చేది లేదని వ్యాపారులు భీష్మించారు. దీంతో అప్పటి నుంచి హాకర్స్‌జోన్ నిరుపయోగంగానే ఉంది.

11ఏళ్ల తర్వాత మళ్లీ ..

ఇప్పుడు మళ్లీ అధికారులు వ్యాపారులను అక్కడికి తరలించే యత్నం చేస్తున్నారు. దీనిలో భాగంగా హాకర్స్ జోన్‌లో సుమారు రూ.14 లక్షలతో దుకాణాలకు మరమ్మతులు, షాపులకు ఇనుపగ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గతంలో రూ.15 లక్షలు, ఇప్పుడు రూ.14 లక్షలు ఈ హాకర్స్ జోన్ కోసం ఖర్చు చేస్తున్నారు. వ్యాపారులు వెళ్లమని చెప్తే ఇన్ని లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని, దీనికి సమాధానమెవరు చెబుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు.అధికారులు మాత్రం ఎలాగైనా వ్యాపారులను తరలించి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడతామంటున్నారు.

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం'



అంబేద్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకాన్ని ప్రదర్శించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి, కార్పొరేటర్ గంగారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ అభ్యుదయం అకాడమీకి చెందిన 40 మంది కళాకారులు నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. దుఃఖం, పేదరికం, హింసకు మూలాలు, వాటికి విముక్తి మార్గాలు, బుద్ధుడి సందేశం, జీవిత చరిత్ర, బుద్ధిజం భారతదేశానికి ఎందుకు అవసరం, అంబేద్కర్ ఆలోచనలను చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి భారత రాజ్యాంగం ఒరిజినల్ ప్రతిని బహూకరించారు. కార్యక్రమంలో బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్, బత్తుల గౌతం బాబు పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

ఉక్కునగరం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిశ్రమల కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య నియమితులయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేయాల్సిన పోరాటాల గురించి చర్చించి వివిధ నిర్ణయాలు తీసుకున్నారు. మల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ కచ్చితంగా అమలు జరిగేలా కృషి చేస్తామన్నారు. దాకే సువర్ణ రత్నం, ఎస్. సత్యనారాయణ పాల్గొన్నారు.

వృక్ష విలాపం

ఇష్టానుసారంగా చెట్ల నరికివేత



చెట్లు నరికి వేయడంతో మిగిలిన మోళ్లు

విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాల్సిన ప్రభుత్వ అధికారులే తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారు. రహదారి మధ్యలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించాల్సింది పోయి ఏకంగా నరికిపాడేశారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఎన్ఎస్‌టీఎల్ 80 అడుగుల రహదారిలో జరిగిన పరిణామాలను చూసిన వారు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

ఇదీ విషయం

ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేటు నుంచి వంశీ సూపర్ మార్కెట్ వరకు రహదారి సుందరీకరణలో భాగంగా గతంలో మొక్కలు నాటారు. అవన్నీ ఏపుగా పెరిగాయి. అయితే ప్రస్తుతం ఇదే ప్రాంతంలో రహదారి అభివృద్ధి పేరుతో ఏపుగా పెరిగిన వాటిని నరికేశారు. రహదారి అభివృద్ధి చేసి, మళ్లీ మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్నారు. అధికారులు చేస్తున్న ఇలాంటి పనులు చూసిన ఆయా కాలనీల ప్రజానీకం విస్తుపోతున్నారు. కూటమి పాలనలో నిధులు ఖర్చు కోసమే ఇలాంటి పనులు చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. అభివృద్ధి పనులు మాటేమోకానీ, రహదారి మధ్యలో మొక్కలను పూర్తిగా మోడు వారేలా చేయడంపై పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు.

జానపద కళలు వారసత్వ సంపద



రామకృష్ణానంద, దుర్గాప్రసాద్‌లను సత్కరిస్తున్న వెంకన్న చౌదరి

సీతంపేట: ఆధ్యాత్మిక ప్రవచన కర్త రామకృష్ణానందకు 'ప్రవచన వాచస్పతి', గేయ రచయిత ఐనాడ దుర్గాప్రసాద్‌కు 'జన కవి' బిరుదులు ప్రదానోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథి వ్యాపారవేత్త యార్లగడ్డ వెంకన్న చౌదరి చేతుల మీదుగా బిరుదులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులను గుర్తించి వారి కళలకు ప్రాచుర్యం అందించిన ఘనత శ్రీమాతా కళాపీఠానికే దక్కిందన్నారు. కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ జానపద కళలు మన వారసత్వమని, వాటిని కాపాడుకోవడం మన కర్తవ్యమని, అందులో భాగంగా ఈ సన్మాన కార్యక్రమం చేస్తున్న శ్రీమాతా కళాపీఠం అధినేతలను కొనియాడారు. రామకృష్ణానంద ప్రవచన కర్తగా తన వాగ్ధాటితో ప్రజలలో ధర్మ, నిర్మలత్వం, నైతికతను పెంపొందిస్తున్నారన్నారు. దుర్గాప్రసాద్ ఐనాడ తన రచనలతో పండిత పామర రంజితంగా సామాజిక సమస్యలపై పాటలు రాసి సమాజ చైతన్యానికి కృషి చేస్తున్నరని ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రీరామనారాయణం టెంపుల్ చైర్మన్ ఎన్‌సీఎస్‌ఈ శ్రీనివాస్, పాడేరు ఎంపీడీవో కుసుమ హర రమేష్, శ్రీమాతా అధినేతలు బి.ఎస్.మూర్తి, పి.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.